

శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైలంలో భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు.



నృత్య నివేదన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా శుక్రవారం నిత్య కళావేదికపై నందికొట్కూరుకు చెందిన సాయి నృత్యకళాశాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యం చేశారు.



బావిలో గుడి.. గుడిలో దేవుడు

సంజామల మండలం పేరుసోమల గ్రామంలోని ప్రాచీన బావికి ఎంతో విశిష్టత ఉంది. బావిలో దేవతామూర్తుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

10లో ▸

న్యూస్‌రీల్

వక్ఫ్ సవరణ చట్టంపై ముస్లింల నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్:వక్ఫ్ సవరణ చట్టంపై శుక్రవారం ఎమ్మిగనూరులో ముస్లింలు నిరసన తెలిపారు.శివసర్కిల్‌లోని అబుబకర్ మసీదులో ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒక చోట చేరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ముస్లింలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నిరసనలో మత పెద్దలు అతావుల్లా మౌలానా, మౌలానా మునీర్, పక్కీర్‌సాబ్, కౌన్సిలర్ వాహిద్, ముస్లింలు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఫీజు' పాట్లు



మాట్లాడుతున్న కటికే గౌతమ్

కర్నూలు (టౌన్): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికే గౌతమ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా విద్యార్థులకు ఫీజు బకాయిలు అందడం లేదన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, విద్యార్థులను వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే విద్యార్థినీ, విద్యార్థులకు, తల్లిదండ్రులకు మద్దతుగా ఉద్యమాల బాట పడతామన్నారు.

అగ్నిప్రమాదాలపై 101కు సమాచారం ఇవ్వాలి



అగ్నిప్రమాదాలను ఎలా నివారించవచ్చో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి వై.చిన్నబజారి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం కల్లూరు ఎస్టేట్‌లోని దామోదర్ ఆయిల్ మిల్, హిందుస్థాన్ పెట్రోల్ బంకుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు అరికట్టడానికి సరిపడే నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది వెంకటరాముడు, హనుమంతు, నరసింహుడు, యు.రామాంజనేయులు, సి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత గోదాములకెరుక!

కందుల కొనుగోళ్లలో మతలబు

- నాసిరకం కందులు విక్రయిస్తున్న దళారీలు, వ్యాపారులు
- సెంట్రల్, స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాముల వద్ద వెలుగులోకి అక్రమాలు
- నాణ్యతా లోపంతో 2,500 క్వింటాళ్లకు పైగా తిరస్కరణ
- ముడుపులతోనే చూసీచూడనట్లు వ్యవహారం
- గుడ్‌విల్ మత్తులో మార్క్‌ఫెడ్ అధికారులు



నంద్యాల జిల్లాలో కందుల లోడింగ్



కర్నూలు జిల్లాలో మద్దతు ధరతో కొనుగోలు చేసిన కందులను లోడింగ్ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేసిన కందులు గోదాముల దగ్గర తిరస్కరణకు గురవుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడి వ్యాపారులు, దళారీల దగ్గర నాసిరకం కందులను సైతం కొనుగోలు చేస్తుండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఏ పంటనైనా మద్దతు ధరతో కొనుగోలు చేయాలంటే కనీస నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో టీడీపీతో పాటు కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ అనుకూల వ్యాపారులు, దళారీల నుంచి నాణ్యత లేని కందులను సైతం కొనుగోలు చేస్తున్నారనే పిర్యాదులు ఉన్నాయి. మొత్తం కొనుగోలు కేంద్రాలను ఆయా జిల్లాల మార్క్‌ఫెడ్ మేనేజర్‌లు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాల నుంచి జిల్లా మేనేజర్లకు గుడ్ విల్ వస్తుండటం వల్ల చూసీచూడనట్లు పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిని అవకాశంగా తీసుకొని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారీలు, వ్యాపారుల నుంచి కందులు మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు. ముడుపులు ముట్టచెబుతుండటం వల్ల నాసిరకం కందులను కూడా కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయిస్తుండటం గమనార్హం.

సెంట్రల్, స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాముల్లో నిల్వ

దాదాపు మూడు నెలలుగా మద్దతు ధరతో కందుల కొనుగోలు జరుగుతోంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 21వ తేదీతో కొనుగోలు కేంద్రాలను ముగించాల్సి ఉంది. అయితే కందుల కొనుగోలు ప్రక్రియను మరింత పొడిగించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 5,575 టన్నులు, నంద్యాల జిల్లాలో 5,500 టన్నులు కొనుగోలు చేశారు. కర్నూలు జిల్లాలో 25 మండలాలు, నంద్యాల జిల్లాలో 21 మండలాల్లో కందుల కొనుగోలు జరుగుతోంది. కొనుగోలు చేసిన కందులను ఆదోని, నందికొట్కూరు, డోన్ తదితర ప్రాంతాల్లోని సెంట్రల్ వేర్‌హౌసింగ్, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. గోదాముల్లో కందులు అన్‌లోడ్ చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేస్తారు. సరుకు గోదాము చేరిన తర్వాతనే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుంది. పండించిన కందులను రైతులు అమ్ముకోవడం దాదాపు పూర్తయింది. మార్కెట్ యార్డులకు కూడా కందులు రావడం తగ్గిపోయింది. దళారీలు, వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరతో కొనుగోలు చేసిన కందులను గోదాముల్లో నిల్వ చేసినట్లు తెలుస్తోంది. ధర పెరిగినప్పుడు అమ్ముకోవాలనేది ఉద్దేశం. అయితే ధర మరింత తగ్గుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో అమ్ముకునేందుకు బయటికి తీసుకొస్తున్నారు.

2,500 క్వింటాళ్లకు పైగా కందులు రిజెక్ట్

మార్క్‌ఫెడ్ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ముడుపులు ఎర వేసి మద్దతు ధరతో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముడుపులు ముడుతుండటంతో నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోని పరిస్థితి. నిజమైన రైతులు తీసుకుపోతే మూడు నాలుగు సార్లు జల్లెడ వేస్తారు. దళారీలు తీసుకెళ్తే జల్లెడ వేయకుండానే కొంటుండటం గమనార్హం. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద జరిగే అక్రమాలు గోదాముల దగ్గర బయటపడుతున్నాయి. అక్కడ నిర్వహిస్తున్న తనిఖీల్లో నాణ్యత గుట్టు బయట పడుతోంది. కర్నూలు జిల్లాకు సంబంధించి దాదాపు 1,575 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు సంబంధించి 950 క్వింటాళ్ల కందులు రిజెక్ట్ అయ్యాయి.

మార్క్‌ఫెడ్ అధికారులకు గుడ్‌విల్ ఇవ్వాల్సిందే..

మద్దతు ధరతో పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే ప్రక్రియ మొదలవుతుందంటే మార్క్‌ఫెడ్ అధికారులకు పండుగే. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ అయినప్పటికీ క్షేత్రస్థాయిలో డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారానే కొనుగోలు చేస్తారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మార్క్‌ఫెడ్ అధికారులకు గుడ్‌విల్ భారీ మొత్తంలోనే ఇచ్చుకోవాల్సి ఉంది. లేదంటే 50 నుంచి 100 క్వింటాళ్లకు ఒక క్వింటా కందులు ముడుపుల కింద ఇవ్వాల్సిందేనని సమాచారం. ఎవరికి వారు మామూళ్ల మత్తులో పడిపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో టీడీపీ మద్దతుదారులైన దళారీలు, వ్యాపారుల హవా నడుస్తోంది. మద్దతు కొనుగోలు కేంద్రాలు వ్యాపారులు, దళారీలకే ఏర్పాటు చేసినట్లు అర్థమవుతోంది.

2014–2018 మధ్య కొనుగోలు కేంద్రాల్లో భారీ అక్రమాలు

- టీడీపీ అధికారంలో ఉన్న 2014–15 నుంచి 2018–19 వరకు దళారీలు, వ్యాపారుల నుంచి కందులు, శనగలు మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆత్మకూరులోని వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేశారు.
- అప్పట్లో గోదాము అధికారులను మచ్చిక చేసుకోవడం వల్ల నాసిరకం సరుకును కూడా అనుమతించారు.
- రెండేళ్ల తర్వాత నాఫెడ్ అధికారులు పరిశీలిస్తే పుచ్చుపట్టి పనికిరాని కందులను గుర్తించారు.
- వందలాది టన్నుల పంట ఉత్పత్తులు పనికి రాకుండాపోయాయి.
- తాజాగా తిరిగి టీడీపీ ప్రభుత్వంలో నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి.
- దళారీలు, వ్యాపారుల నుంచి మామూళ్ల మత్తులో పడి నాసిరకం కందులు కొనుగోలు చేస్తుండటం వల్ల రానున్న రోజుల్లో దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు.

డోన్‌లో ఇష్టారాజ్యం

అన్ని మండలాల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లి కందులను కొనుగోలు చేస్తే డోన్‌లో మాత్రం రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చి అమ్ముకునేలా సెంటర్ నిర్వాహకుడు షరతు విధించాడు. డోన్ మండలంలో డీసీఎంఎస్ బ్రాంచ్ కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తోంది. టీడీపీ వర్గీయులు బలంగా ఉన్న గ్రామాలకు వెళ్లి కందులను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఈ విధంగా 4 గ్రామాల్లో మాత్రమే కొన్నారు. మిగిలిన అన్ని గ్రామాల రైతులు మార్కెట్‌యార్డుకు తెచ్చి అమ్ముకోవాలనే నిబంధన పెట్టారు. ఇందువల్ల రైతులపై రవాణ చార్జీల భారం పడింది. క్వింటాకు 2800 గ్రాముల కందులు అదనంగా తీసుకున్నారు. మద్దతు ధరతో అమ్ముకోవడానికి వెళ్లిన రైతులు దోపిడీకి గురయ్యారు.

మద్దతు ధర: 7,550

కొనుగోళ్లకు ఆఖరు తేది: ఈనెల 21

5,575 టన్నులు కర్నూలు జిల్లాలో కొనుగోలు చేసిన కందులు

5,500 టన్నులు నంద్యాల జిల్లాలో కొనుగోలు చేసిన కందులు

2,500 క్వింటాళ్లు నాణ్యత లేక గోదాముల వద్ద తిరస్కరించిన కందులు

ఇదీ కొను'గోలుమాల్' వ్యవహారం

కందులు నాణ్యత లేకపోతే ఒకటి, రెండు సార్లు జల్లెడ వేయాల్సి ఉంది. అయితే ముడుపుల కారణంగా వచ్చిన వాటిని వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందువల్ల గోదాముల దగ్గర జరుపుతున్న నాణ్యత ప్రమాణాల్లో వందల క్వింటాళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి.

- నిజమైన రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నప్పుడు నాణ్యతకు పెద్దపీట వేస్తుండటం.. దళారీలు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నప్పుడు నాణ్యతను విస్మరించడం వెనుక ముడుపుల వ్యవహారం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

మార్గదర్శకాలకు అనుగుణంగానే కొనుగోళ్లు



కందుల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. మార్గదర్శకాలకు అనుగుణంగా మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాం. అనంతరం సెంట్రల్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదాములకు తరలిస్తున్నాం. అక్కడ ప్రతి సంచి కందుల నాణ్యతను చెక్ చేస్తున్నారు. తగిన నాణ్యతా ప్రమాణాలు లేకుంటే రిజెక్ట్ అవుతాయి. రైతులు అంగీకరిస్తే మళ్లీ జల్లెడ వేసి పంపుతాం. జిల్లాకు సంబంధించి 80–90 టన్నుల వరకు రిజెక్ట్ అయ్యాయి. అంతమాత్రాన అక్రమాలు జరిగినట్లు కాదు.

– జి.రాజు, జిల్లా మేనేజర్, కర్నూలు

జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్

- జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లలో పర్యటించిన ఎస్పీ



కర్నూలులో గస్తీ విధులు తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ఏపీ డీజీపీ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా అంతటా ఏకకాలంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు అన్ని ముఖ్యమైన రోడ్లు, కూడళ్లల్లో రేడియం జాకెట్లు ధరించి పోలీసులు సరికొత్తగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో పర్యటించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉల్చాల వై–రోడ్ జంక్షన్‌లో ఎస్పీ తనిఖీల్లో పాల్గొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచరింపు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. వివిధ కాలనీల్లోని ప్రజలతో ముఖాముఖి మాట్లాడి స్థానికంగా ఉంటున్న సమస్యల గురించి పోలీసులు ఆరా తీశారు. ప్రజలతో మమేకం కావడంతో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందే వీలుంటుందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు మధుసూదన్‌గౌడ్, నాగరాజరావు తదితరులు కూడా ఎస్పీ వెంట ఉన్నారు.

గుడ్‌ఫ్రైడే సందర్భంగా కర్నూలు నగరంలోని ప్రేమగిరిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



లోక రక్షకుడు ఏసు

జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేసి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు శిలువ మీద పలికిన ఏడు మాటలను పాస్టర్లు, ఫాదర్లు గుర్తు చేశారు. ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించారు. ఏసుక్రీస్తు బోధనలను విశ్వసించి సన్మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ, జాలి గుణం కలిగి ఉండాలన్నారు. బైబిల్ వాక్యాలను పఠించారు.

రుణాలు ఊరించి.. చేయూత మరిచి!

బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపులకు అరచేతిలో వైకుంఠం

- కర్నూలు జిల్లాలో 2,034 మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యం
- 27,140 మంది దరఖాస్తు
- పూలే జయంతి రోజున 508 మందికి మెగా చెక్కు
- మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకం
- వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్నాల పేరిట 6.97 లక్షల మందికి లబ్ధి



జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్

కర్నూలు(అర్బన్): బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించనున్నట్లు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, మైనారిటీ వర్గాలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి వారి ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకొస్తామని ప్రకటించింది. అయితే కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడంలో ఆరంభ శూరత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచిపోయినా, నేటికి కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. జనవరి నెల మొదటి వారంలో బీసీ వర్గాలకు రుణాలు అందించేందుకు అంతా సిద్ధమైందని, వెంటనే అర్హత కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని తేదీలు ప్రకటించి మరీ హడావుడి చేశారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు ఉద్దేశించిన ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ పలు ఆర్థిక, సాంకేతిక కారణాల వల్ల ఆలస్యంగా ఓపెన్ అయ్యింది. కర్నూలు జిల్లాలో బీసీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన 2,034 మందికి (బీసీ 1673, కాపు 190, ఈడబ్ల్యూఎస్ 171) సబ్సిడీ, బ్యాంకు రుణం కలిపి రూ.41.23 కోట్ల మేర స్వయం ఉపాధి పథకాలకు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో అర్హులైన 27,140 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2049.22 కోట్ల లబ్ధి

గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించి అమలు చేసిన వివిధ పథకాల ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6,97,147 మంది లబ్దిదారుల ఖాతాల్లో రూ.2049.22 కోట్లు జమ అయ్యాయి.

508 మంది ఎంపికైనట్లు మెగా చెక్కు

జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించిన లక్ష్యం మేరకు 2,034 మందికి రూ.41.23 కోట్ల మేర రుణాలను అందించాల్సి ఉంది. అయితే ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రుణాలకు సంబంధించి 508 మంది లబ్దిదారులు ఎంపికైనట్లు రూ.11.77 కోట్ల మెగాచెక్కును అందించారు. ఇందులో 488 మంది బీసీలు, 7గురు కాపులు, 13 మంది ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన వారు ఉన్నారు. అయితే లక్ష్య సాధనలో భాగంగా 508 మంది పోగా, మిగిలిన 1,526 మందికి రుణాలు ఎప్పుడు అందిస్తారనేది ప్రశ్నార్థకం.

ఏపీ పథకాల ద్వారా ఎంతెంతంటే ....

పథకం	లబ్ధి పొందిన వివిధ వర్గాలు	జమ అయిన మొత్తం(రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	1,24,045	రూ.905.80
వైఎస్సార్ ఆసరా	2,49,976	రూ.568.28
కళ్యాణమస్తు, షాదీ తోఫా	2952	రూ.23.71
జగనన్న తోడు	92,739	రూ.126.81
వైఎస్సార్ భీమా	4578	రూ.45.49
వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు	29520 (గ్రూపులు)	రూ.140.36
జగనన్న చేదోడు	102452	రూ.102.45
వైఎస్సార్ కాపు నేస్తం	26152	రూ.39.22
ఈబీసీ నేస్తం	64733	రూ.97.10
మొత్తం:	6,97,147	రూ.2049.22

అందరికీ రుణాలు అందుతాయి

మొదటి విడతలో ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి రోజున జిల్లాలో ఎంపికైన 508 మందికి రూ.11.77 కోట్ల మెగాచెక్కును లబ్దిదారులకు జిల్లా కలెక్టర్ అందించారు. జిల్లాకు నిర్ణయించిన లక్ష్యం మేరకు మిగిలిన వారికి కూడా రుణాలు అందుతాయి.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల నుంచి లబ్దిదారుల జాబితాలను బ్యాంకులకు పంపి ఖాతాలను ఓపెన్ చేయించి జాబితాలను తమ కార్యాలయాలకు పంపాలని కోరనున్నాం. జాబితాలు అందిన వెంటనే జిల్లా కలెక్టర్ ద్వారా ఆమోదం తీసుకొని తమ శాఖ ఉన్నతాధికారి కార్యాలయానికి పంపుతాం.



– ఎస్ జాకీర్‌హుసేన్, ఈడీ, బీసీ కార్పొరేషన్

అకాల వర్షం.. అపార నష్టం



గజ్జహళ్లిలో నేలకొరిగిన వరి పైరు



కల్లంలో తడిసిన మిరప

హొళగుంద/చిప్పగిరి: ఈదురుగాలులతో కురిసిన వడగండ్ల వాన రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. హొళగుంద మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. కల్లాల్లో నిల్వ ఉంచిన మిరప తడిసిపోయింది. తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద వందలాది ఎకరాల్లో వరి సాగు చేశారు. పైరు గింజ దశలో ఉన్న సమయంలో వడగండ్ల వాన పడింది. దీంతో పైరులోని 90 శాతం మేర గింజలన్నీ నేలరాలాయి. అలాగే పైరు నేలకొరిగింది. ఇప్పటికే కోత జరిగి కల్లాల్లో ధాన్యం బస్తాలు ఉంచగా తడిసిపోయాయి. అదేవిధంగా మిరప, మామిడి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి పూత నేల రాలి దెబ్బ తినగా.. కల్లంలో ఉంచిన ఎండు మిరప నీటిలో నానిపోయింది. ఈదురుగాలులకు పెద్దహరివాణం రోడ్డులో, గజ్జహళ్లి బీసీ కాలనీలో చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఉరుములు, మెరుపులతో ప్రజలు బయటకు రాలేకపోయారు. చేతికందే దశలో వరిపంట దెబ్బతిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. చిప్పగిరి మండలంలోని నేమకల్లు, రామదుర్గం, బెల్డోణ, దౌల్తాపురం నంచర్ల తదితర గ్రామాల్లో పెద్దఎత్తున మెరుపులు, ఉరుములతో వర్షం కురిసింది. నేమకల్లు, కుందనగుర్తి గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ అంతరాయంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పగలు ఎండలు.. సాయంత్రానికి వానలు

కర్నూలు అగ్రికల్చర్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్ర పెరిగింది. వేడి గాలులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం కర్నూలు, అటు నంద్యాల జిల్లాలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. పగలు మహానందిలో 41.5, పాణ్యంలో 41.5, గోస్పాడులో 41.6, డోర్నిపాడులో 41.7, గడివేములలో 41.1, కర్నూలులో 40.4, కోడుమూరులో 40.1 ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం హొళగుంద, ఆలూరు, ఆత్మకూరు, బనగానపల్లె, కొత్తపల్లి, కోవెలకుంట్ల తదితర మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆస్పరిలో పిడుగు పడిన ఘటనలో ఒక ఎద్దు మృతిచెందింది.

క్లుప్తంగా

మత్స్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని దేశీయ మత్స్యశిక్షణా కేంద్రంలో కార్యక్రమం మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి రంగనాథబాబు తెలిపారు. చేపల పెంపకంపై ఆసక్తి కలిగిన రాయలసీమ జిల్లాలకు చెందిన యువత సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, మత్స్య సహకార సంఘాల సభ్యులు, చేపల పెంపకందారులు, లైసెన్స్ దారులు అర్హులేనని పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై చేపల పెంపకం పట్ల ఆసక్తి ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 29వ తేదీలోపు బంగారుపేటలోని మత్స్యశాఖ అధికారి కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. శిక్షణా కాలంలో నెలకు రూ.1000 ఉపకార వేతనం చెల్లించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రాయలసీమలోని జిల్లాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవచ్చని కోరారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతున్న కొలనుభారతి క్షేత్రంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేటప్టారు. పంచమి మూల నక్షత్రం కావడంతో అమ్మవారిని అలంకరించి పంచసూక్తములతో అభిషేకాలు, కుంకుమార్చనలు, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ అమ్మవారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు బీజాక్షరాలు రాయించి సుమారు 50 మంది దాక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి



ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరిలో శుక్రవారం పిడుగు పాటుకు ఓ ఎద్దు మృతి చెందింది. రైతు మహబూబ్‌బాషా వామి దొడ్డిలో ఎద్దులను కట్టేశాడు. అయితే ఎద్దులకు సమీపంలో పిడుగు పడటంతో ఒకటి అక్కడికక్కడే మృతి చెందగా మరొకటి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఎద్దు మృతి చెందడంతో రైతుకు రూ.60 వేలు నష్టం వాటిల్లింది.

మహిళ అదృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీ నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ రెండు రోజులుగా కనిపించడం లేదు. స్థానికంగా నివాసముంటున్న నాగమణి ఓ ప్రైవేటు ఫైనాన్స్ కార్యాలయంలో పని చేస్తోంది. గురువారం ఉదయం ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లి మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చిన మహిళ ఇంటికి రాలేదు. బంధువులు, ఆయా ప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించినా తెలియలేదు. తమ కుమార్తె కనిపించడం లేదని నాగమణి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేసీ తిరుపాల్ తెలిపారు.

బావిలో గుడి.. గుడిలో దేవుడు



శివాలయం, రామాలయం



కాలభైరవుడు



రామాయణ ఘట్టాలను తెలిపే శిల్పాకృతులు



చిన్న కోనేరు (బావి)ను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

అద్భుత కట్టడం (ఇన్‌సెట్) సీతారాముల విగ్రహాలు, శివ లింగం



దాదాపు ఐదు శతాబ్దాల నాటి కట్టడం నేటికీ చెక్కు చెదరలేదు. కాలగర్భంలో కలిసి పోతున్న ప్రాచీన బావిని పరిరక్షించేందుకు గ్రామస్తులు ఒక్కటయ్యారు. పూడికను తొలగించి అందుబాటులోకి తెచ్చారు. పేరుసోమల గ్రామం అంటే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది చెన్నకేశవ స్వామి ఆలయం. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఆలయాన్ని క్రీ.శ 1535లో అప్పటి రాజులు రామరాజు, తిక్కరాజు నిర్మించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయానికి అనుబంధంగా చిన్న కోనేరు, పెద్ద కోనేరు కూడా అప్పట్లో నిర్మించగా రెండూ పూడికతో నిండిపోయాయి. ఈ క్రమంలో ప్రాచీన బావి పరిరక్షణ కోసం గ్రామస్తులు, 'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' ఆధ్వర్యంలో ఇటీవల చిన్న కోనేరులో పూడిక తీత పనులు చేపట్టి శుభ్రం చేశారు. దీంతో బావిలోని రామాలయం, శివాలయం దర్శనానికి వీలైంది. దేవతా మూర్తుల విగ్రహాలు, ఇతిహాసాలను వివరించే శిల్పా కళా రూపాలు ఆకట్టుకుంటున్నాయి. దాదాపు 490 సంవత్సరాల అద్భుత కట్టడాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. – సంజామల

మహాత్ముల త్యాగమే సమాజ బలం





రఘునాథ దేశికుల రమ్య కథ సీడీని ఆవిష్కరిస్తున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార, రామానుజ జీయర్ స్వామి , హాజరైన భక్తులు

కర్నూలు కల్చరల్: మహాత్ముల త్యాగమే సమాజ బలమని పలువురు జీయర్ స్వామీజీలు, పీఠాధిపతులు అన్నారు. ఉభయ వేదాంత పండితులు సత్సంప్రదాయ పరిరక్షణ సభ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి శత జయంతి సందర్భంగా గోదా గోకులంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీమద్రామాయణ మహా యజ్ఞం శుక్రవారం ముగిసింది. అందులో భాగంగా 2 వేల మందితో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, ప్రయాగ్రాజ్ నుంచి రాఘవ ప్రసన్న జీయర్ స్వామి, శ్రీశ్రీ త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామి ఆచార్య పరమాత్మానంద గిరి స్వామి, విరజానంద స్వామి సందేశం ఇచ్చారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగీత యుక్త ఇష్టలింగ మహాపూజ



మహాపూజ నిర్వహిస్తున్న కాశీ జగద్గురువు



కార్యక్రమానికి హాజరైన భక్తులు

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కాశీ మఠం వారణాసి పీఠాధిపతి మల్లికార్జున శివాచార్య మహా స్వామి ఆధ్వర్యంలో సంగీత యుక్త ఇష్టలింగ మహాపూజ వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర జయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజు శుక్రవారం ఉదయం జరిగిన బృహత్తర కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సంగీత కార్యక్రమాలు, భజనలు, పూజలతో హొళగుందలో ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంది. ఈ సందర్భంగా జగద్గురువు భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య, పాల్తూరు చెన్నవీర శివాచార్య, కొట్టూరు శాకామఠానికి చెందిన మరికొట్టూరు దేశికేంద్ర మహాస్వాములు, నందీపుర డాక్టర్ మహేశ్వరా శివాచార్య మహాస్వాములు, రౌడకుంద శివయోగి శివాచార్య మహాస్వాములు హాజరయ్యారు.

లింగ పూజ పరమ శ్రేష్టం

మనసు చెంచలం కాకుండా క్రమశిక్షణ, ఏకాగ్రత, ప్రశాంతతకు లింగ పూజ ఎంతో ఉపయుక్తకరంగా ఉంటుందని కాశీ జగద్గురువులు అన్నారు. కుళ్ల కుతంత్రలు వదిలి తమకు చేతనైనంత మేర పేదలకు దాన ధర్మాలు చేస్తే మనశ్శాంతి లభిస్తుందని చెప్పారు. శాంతితో ప్రశాంత జీవనం గడుపుకునేలా జీవితాన్ని తీర్చుకోవాలని ఆయన ఉపదేశం చేశారు. ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుని మంచి మార్గాల్లో నడవాలన్నారు. నవ సమాజాన్ని నిర్మించుకోవాలని భక్తులకు ఆయన బోధ చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాల యజమానులకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఆయా ప్రాంతాల నుంచి 18 జతల వృషభాలు ఈ పోటీల్లో పాల్గొనాయి. చెన్న కేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు రైతు సంఘం నాయకులు బూషిరెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి పోటీలను ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాల యువకులు, రైతులు పోటీలను తిలకించడానికి రావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈలలు కేరింతల మధ్య వృభజ రాజములు రంకెలు వేస్తుండగా పోటీసులు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలుకు చెందిన అక్షరారెడ్డి, కోడుమూరుకు చెంఇన శశాంక్ శ్రేయ ఎద్దులు సంయుక్త విజేతగా నిలిచి ప్రథమ, ద్వితీయ నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి ఎద్దులు తృతీయ, ఎమ్మిగనూర్‌కు చెందిన సాయి వర్ధన్ వృషభాలు నాల్గొవ, సంజామలకు చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు 5వ స్థానంలో నిలిచాయి. దాతలు సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులను దాతలు, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రైతు సంఘం నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగభూషణం రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, రామ్ మోహన్‌రెడ్డి, అన్నారావు, వీరభద్రారెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

శ్రీనగర్ ఎస్పీగా కర్నూలు వాసి



శ్రీనగర్ ఎస్పీగా నియమితులైన సందీప్ చక్రవర్తి

కర్నూలు: జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో కర్నూలు వాసి డాక్టర్ సందీప్ చక్రవర్తి శ్రీనగర్ ఎస్పీగా నియమితులయ్యారు. ఈయన ఎంబీబీఎస్ పూర్తి చేసి 2013లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. విద్యాభ్యాసం మొత్తం కర్నూలులోనే జరిగింది. ఈయన తండ్రి డాక్టర్ రాంగోపాల్ రావు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఆర్ఎంఓగా పదవీ విరమణ పొంది ప్రస్తుతం కర్నూలు బీ–క్యాంప్‌లో నివాసముంటున్నారు. సందీప్ చక్రవర్తి పోలీసు శాఖలో చేరినప్పటి నుంచి జమ్మూ కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఏఎస్పీగా పూంచ్, యూరి, సోపోర్, బారాముల్లా, శ్రీనగర్ సౌత్ జోన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో శ్రీనగర్ ఎస్ఎస్పీగా నియమితులయ్యారు. విధి నిర్వహణలో ఈయన ఆరు పీఎంజీ, నాలుగు సార్లు జేకే పీఎంజీ, ఐదు సీఆర్‌పీఎస్ డీజీపీ కమాండెంటేషన్, రెండు సార్లు ఇండియన్ ఆర్మీ డిస్క్, ఒక్కసారి జమ్మూకాశ్మీర్ డీజీపీ నుంచి కమాండెంటేషన్ డిస్క్, ఒకసారి ఐటీ బీపీఈడీటీ కమాండెంటేషన్ డిస్క్ పతకాలను పొందారు.

బీహార్ సర్పంచ్‌ల బృందం సందర్శన



కొలూరు గ్రామ సచివాలయం వద్ద బీహార్ సర్పంచ్‌లు

కర్నూలు(రూరల్)/పాణ్యం: గార్గేయపురం, కొలూరు గ్రామాలను శుక్రవారం బీహార్ సర్పంచ్‌ల బృందం సందర్శించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు హైదరాబాద్ వారి అధ్వర్యంలో దాదాపు 55 మంది ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామం నుంచి సేకరించే తడి, పొడి చెత్త నుంచి తయారు అయ్యే సేంద్రియ ఎరువు యూనిట్‌ను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎన్ఐఆర్‌డీ అధికారిణి ప్రత్యూష పట్నాయక్, గార్గేయపురం సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఈఓఆర్‌డీ చంద్రమౌళీశ్వరగౌడ్, జిల్లా ప్రాజెక్టు రిసోర్సుశిక్షకులు గిడ్డయ్య తదితరులు ఉన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, కర్నూలు ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్

కోసిగి/పెద్దకడబూరు: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ భార్గవ్ రెడ్డి, కర్నూలు ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాలపల్లి నుంచి కంబాలదిన్నె గ్రామం వైపు పోవు రోడ్డులోని మారెమ్మ గుడి వెనుక భాగం మట్టి రోడ్డులో కారులో 40 బాక్స్‌ల్లో టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన గోవిందు, పోలి వీరేష్, మజ్జిగ బొజ్జప్ప లు, పెద్దకడబూరు మండలం కంబదహాల్ గ్రామానికి చెందిన బోయ బాలును అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. అలాగే రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఆదోని శివశంకర్, కంబాలదిన్నె గ్రామానికి చెందిన బోయ ఉసేని పరారయ్యారు. పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారైన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐలు తెలిపారు. దాడుల్లో కోసిగి ఎక్సైజ్ ఎస్ఐ కె. నాగేంద్ర, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్లు భరత్, రవి కుమార్, మునిరంగడు, కర్నూలు ఈఎస్‌టీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుళ్లు మధు, లాలూ, కుమార్ స్వామి రెడ్డి పాల్గొన్నారు.

డీఎన్ఏ టెస్టుకు మృత శిశువు రక్త నమునాలు

- గర్భిణి చేసి మోసం చేశాడని ఐదు నెలల క్రితం మహిళ ఫిర్యాదు
- యువకుడిని రిమాండ్‌కు పంపిన పోలీసుల

కౌతాళం: ప్రేమ వ్యవహారం కేసు సినిమాను తలపిస్తోంది. దాదాపు ఐదారు నెలలుగా ఈ కేసు చర్చనీయాంశంగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన కౌతాళంకు చెందిన వికలాంగురాలు హనుమంతమ్మ, ఆనంద్‌ది ఒకే కాలనీ. వీరిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకోవాలన్నారు. కాని వయస్సులో తేడా కావడంతో ఆనంద్ మనస్సు మార్చుకుని మొహం చాటేశాడు. అప్పటికే ఆమె గర్భిణి కావడం, ఆనంద్ తనకేమి తెలియదని చెప్పడంతో ఐదు నెలల క్రితం బాధితురాలు కౌతాళం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆనంద్‌ను రిమాండుకు పంపారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. కాగా గురువారం రాత్రి హనుమంతమ్మ మగ శిశువుకు జన్మనివ్వగా, కాసేపటి తర్వాత శిశువు మృతి చెందాడు. ప్రేమ వ్యవహారం కేసు నమోదు కావడంతో మృత శిశువు రక్త నమునాలను డీఎన్ఏ టెస్టుకు పంపిస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. కాగా తనను ఆనంద్ బెదిరిస్తున్నాడని, డీఎన్ఏ రిపోర్టును కూడా మార్చుతానని భయపెడుతున్నాడని హనుమంతమ్మ శుక్రవారం ఆదోనిలో విలేకరుల సమావేశంలో తెలిపింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆమె పోలీసులను కోరింది.

అహోబిలేశుడి సేవలో కేంద్ర మంత్రి



మంత్రికి ఆలయ విశిష్టతను వివరిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను కేంద్ర ఆహార పౌరసరఫరాల, శుద్ధ ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అహోబిలం క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశ్వీరచనాలు అందించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, అహోబిలం దేవస్థాన మేనేజర్ మాధవన్ తదితరులు ఉన్నారు

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుమ్మితం తండా, గుడుంబాయి తండా గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు చేపట్టారు. కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ, ఎస్ఐ మధు, సిబ్బంది రామలింగయ్య, చంద్రపాల్, చంద్రుడు, వీరన్న తదితరులు బృందాలుగా ఏర్పడి సారా స్థావరాలపై దాడులు చేశారు. గుమ్మితంతండాలో 400 లీటర్ల బెల్లం ఊట, 15 లీటర్ల నాటుసారా, గుడుంబాయి తండా శివారులో 600 లీటర్ల నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊట, 15 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసి బట్టీలను పగులగొట్టారు. సారాకు వినియోగించే సామాగ్రి, ప్లాస్టిక్ డబ్బులు, బిందెలు, వంట పాత్రలన్నీ స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీబాయి, లోక్‌నాయక్‌లు కలసి సారా తయారీ చేయిస్తున్నట్లు వెలుగు చూసిందని, వారిని త్వరలో అరెస్టు చేయనున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి సారా వినియోగం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయనే విషయాలను వివరించారు. నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా దాడులు ఇకపై విస్తృతంగా కొనసాగుతాయని, సారా తయారీ, విక్రయాలు, రవాణా ఆపకపోతే పీడీ కేసులు నమోదు చేసి శాశ్వతంగా జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగంలో నివాసం ఉంటున్న తిమ్మాపురం ఈరన్న, దళవాయి యల్లయ్య మధ్య పొలం రస్తా విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం పొలంలో రస్తా విషయంలో గొడవ పడగా, అది మనస్సులో పెట్టుకుని రాత్రి ఇంటి ప్రాంగణంలో గొడవపడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందులో తిమ్మాపురం ఈరన్న మెడకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దపెండేకల్ గ్రామానికి చెందిన సుభాన్ అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. సుభాన్ ఆంధ్రాకు చెందిన మద్యం అక్రమంగా అమ్ముతుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 180 ఎంఎల్‌ల 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.